


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 14-05-2022 సంపుటి: 03 సంచిక: 237 పేజీలు: 4 వెల: రూ 3-00


## బీజేపీ పాలనలో ఇబ్బందులు పడుతున్న మైనారిటీలు

### దేశాన్ని ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పట్టి పీడిస్తోంది
### కాంగ్రెస్ నవ సంకల్ప్ చింతన్ శిబిర్లో మండిపడ్డ సోనియా గాంధీ




ఉదయ్‌పూర్ మే 13 రాజస్థాన్ ఉదయ్‌పూర్ వేదికగా కాంగ్రెస్ నవ సంకల్ప్ చింతన్ శిబిర్ ప్రారంభమైంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా నేతలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ అనుసరిస్తున్న విధానాల ఫలితంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించుకోవడానికి ఈ శిబిర్ ఓ అవకాశాన్ని ఇస్తోందని సోనియా అన్నారు. అదేవిధంగా పార్టీ ముందున్న అనేక సవాళ్లను చర్చించుకోడానికి కూడా ఇదో అవకాశమని సోనియా అన్నారు. ఈ శిబిరం జాతీయ అంశాలను చర్చించడంతో పాటు ఆత్మావలోకనం కోసం కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ఇన్ని సంవత్సరాల పాటు నేతలందరికీ పార్టీ ఎంతో ఇచ్చిందని, ఇప్పుడు నేతలందరూ పార్టీకి ఇవ్వాలని, వారందరూ బాకీ పడ్డారని అన్నారు. కాంగ్రెస్‌పై దేశ ప్రజలు భారీ అంచనాలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చాలని సూచించారు. దేశ సంక్షేమం కోసం పార్టీ ఎంతో పనిచేసిందని, అలాంటిది? బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల పార్టీ ఎంతో ఇబ్బందులు పడుతోందన్నారు. పార్టీని పూర్తిగా రిపేర్ చేయాల్సిన తరుణం ఆసన్నమైందని సోనియా అంగీకరించారు. పార్టీని రిపేర్ చేసి, మెరుగైన పనితీరును కనబరచాలని సోనియా సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆరెస్సెస్‌పై సోనియా గాంధీ విమర్శలు చేశారు. బీజేపీ పాలనలో మైనారిటీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి శాంతి కరువైందని ఆరోపించారు. దేశాన్ని ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పట్టి పీడిస్తోందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ మైనారిటీల్లో భయాందోళనలను రేపుతోందని, ఓట్లను పోలరైజ్ చేస్తూ, లేనిపోని భయాందోళనలు రేపుతోందని సోనియా మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం మాక్సిమమ్ గవర్నెన్స్- మినిమమ్ గవర్నమెంట్ అంటూ కొత్త నినాదాన్ని ఎత్తుకుందని సోనియా గుర్తు చేశారు. దీనర్థం.. దేశంలో పోలరైజేషన్ రాజకీయాలు చేయడం, ప్రజలను భయాందోళనలో ఉంచడమేనని విరుచుకుపడ్డారు. ఈ దేశంలో భాగమైపోయిన మైనారిటీలను భయపెట్టడమే దీనర్థమని సోనియా నిర్వచించారు.

## మంచి జరిగితే రాబందులకు నచ్చదు: సీఎం జగన్



కోనసీమ జిల్లా: చంద్రబాబు పాలనలో మత్స్యకారులను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ పాలనకు.. మన ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని కోరారు. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళలో నాలుగో ఏడాది 'వైఎస్సార్ మత్స్యకార భరోసా' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించామన్నారు. "మత్స్యకారుల కష్టాలను పాదయాత్రలో దగ్గరగా చూశా. వరుసగా నాలుగో ఏడాది కూడా మత్స్యకార భరోసా అమలు చేస్తున్నాం. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున సాయం అందిస్తున్నాం. 1,08,755 మంది మత్స్యకారులకు రూ.109 కోట్లు జమ చేస్తున్నాం. మత్స్యకార భరోసా కింద ఇప్పటివరకు రూ.418 కోట్ల సాయం అందించాం. వేట కోల్పోయిన 23,458 మంది మత్స్యకారులకు ఓన్‌జీసీ పరిహారం అందిస్తున్నాం. జీవనోపాధి కోల్పోయిన 69 గ్రామాల మత్స్యకార కుటుంబాలకు రూ.11,500 చొప్పున 4 నెలలపాటు ఓన్‌జీసీ చెల్లించిన రూ.108 కోట్ల పరిహారం అందిస్తున్నాం. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.217 కోట్లు జమ చేస్తున్నాం. గత ప్రభుత్వం బకాయిపెట్టిన 70 కోట్లను మన ప్రభుత్వమే చెల్లించిందని" సీఎం అన్నారు. మంచి చేశామని మనలా చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదు. చంద్రబాబు చేశాడని చెప్పే ధైర్యం దత్తపుత్రుడితో పాటు ఎల్లోమీడియాకు కూడా లేదు. నిజాయితీ నిబద్ధతతో ప్రజల ముందుకు వస్తున్నాం. దుష్ట చతుష్టయం అంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు.. నలుగురికి తోడు వీరి దత్తపుత్రుడు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని వీరు జీర్ణించుకోలేరు. ఏదైనా వ్యాధికి ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకోవచ్చు.. కానీ ఈర్ష్య, కడుపు మంటకు వైద్యం లేదు. కొడుక్కి పచ్చి అబద్ధాలు, మోసాలతో ట్రైనింగ్ ఇస్తున్న చంద్రబాబు లాంటి తండ్రిని ఎక్కడైనా చూశారా? కోర్టుకి వెళ్లి మంచి పనులు అడ్డుకునే ప్రతిపక్షాన్నిఎక్కడైనా చూశారా?. పరీక్షల పేపర్లు వీళ్లే లీక్ చేస్తారు. పేపర్ లీక్‌ను సమర్థించిన ప్రతిపక్షాన్ని ఎక్కడైనా చూశారా?. ఈఎస్ఐలో డబ్బులు కొట్టేసిన నాయకుడిని విచారించడానికి వీల్లేదనే ప్రతిపక్షం, ఎల్లోమీడియాను ఎక్కడైనా చూశారా?. ప్రజలకు మంచి జరిగితే ఇలాంటి రాబందులకు అసలు నచ్చదంటూ" సీఎం మండిపడ్డారు. "సీఎం జగన్ ప్రభుత్వంలో పేదలకు మంచి జరగడాన్ని దుష్ట చతుష్టయానికి నచ్చదు. కేంద్రం నుంచి డబ్బులు వచ్చినా వారికి బాధే.. అప్పులు వచ్చినా వారికి బాధే. ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్న రాబందులను ఏమనాలి?. వీరిని రాష్ట్ర ద్రోహులు అందామా.. దేశ ద్రోహులు అందామా?. కళ్లు ఉండి మంచిని చూడలేని కబోదులు. కుప్పంలో ఇళ్లు కట్టుకోవాలన్న ఆలోచన చంద్రబాబుకు ఏనాడూ లేదు. జగన్ పరిపాలన చూశాకే కుప్పంలో చంద్రబాబు ఇళ్లు కట్టుకుంటున్నారు. వక్రబుద్ధి ఉన్న చతుష్టయం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని దేవుడిని కోరుకుంటున్నానని" సీఎం జగన్ అన్నారు.

## దేశంలో కొత్తగా 2841 కరోనా కేసులు



ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పడుతోంది. గత 24 గంటల్లో 2841 కరోనా పాజిటివ్ కేసులు నమోదుకాగా తొమ్మిది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు 4.31 కోట్ల మందికి కరోనా వైరస్ సోకగా 5.24 లక్షల మంది చనిపోయారు. కరోనా నుంచి 4.25 మంది కోట్ల కోలుకోగా 18 వేల మంది చికిత్స పొందుతున్నారు. దేశంలో ఇప్పటి వరకు 190 కోట్లకు పైగా డోసులు పంపిణి చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది.

## భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు..

### శ్రీలంక నూతన ప్రధాని విక్రమ సింఘే

శ్రీలంక తదుపరి ప్రధానిగా రణిల్ విక్రమ సింఘే గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భారత్‌కు, భారత ప్రధానికి విక్రమ సింఘే ధన్యవాదాలు తెలిపారు. తమ దేశం ఇబ్బందుల్లో వున్న సమయంలో భారత్ తమకు సహాయం చేసిందని, అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని విక్రమ సింఘే వివరించారు. భారత్‌తో తాను సన్నిహిత, సత్సంబంధాలనే కోరుకుంటున్నానని, ఆ దిశగానే పని చేస్తానని ప్రధాని విక్రమ సింఘే ప్రకటించారు. ప్రజాస్వామ్య బద్ధంగా, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తాము కూడా రెడీ ఉన్నామని భారత్ స్పందించింది. అలాగే శ్రీలంక ప్రజానీకానికి అవసరమైన సహాయం అందిస్తామని కూడా హామీ ఇచ్చింది. శ్రీలంక కొత్త ప్రధానిగా ప్రతిపక్ష యూఎన్‌పీ పార్టీ నేత రణిల్ విక్రమ సింఘే(73) గురువారం ప్రమాణం చేశారు. అంతకుముందు అధ్యక్షుడు గొటబయ రాజపక్స అధికార ఎస్ఎల్‌పీపీ, ఇతర పార్టీల నేతలతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధాన మంత్రిగా విక్రమ సింఘేకు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. దీంతో, గొటబయ అధ్యక్ష కార్యాలయంలోనే విక్రమ సింఘే చేత ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని మహింద కూడా విక్రమ సింఘేకు శుభాకాంక్షలు చెప్తూ ట్వీట్ చేశారు.



## నారాయణకు నోటీసులు..

### అడిషనల్ ఏజీ వాదనలతో ఏకీభవించిన కోర్టు

చిత్తూరు: మాజీ మంత్రి నారాయణ బెయిల్ రద్దు చేయాలంటూ చిత్తూరు కోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం తరపున అడిషనల్ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీ వ్యవహారం లో ఈ నెల 10న నారాయణ అరెస్టయిన విషయం తెలిసిందే. 11వ తేదీ తెల్లవారుజామున నారాయణకు చిత్తూరు నాల్గవ అదనపు జడ్జి బెయిలు మంజూరు చేశారు. టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నారాయణ కుట్ర ఉందని, బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.



చదవండి: నారాయణ 'లీక్స్'.. వెలుగులోకి నివ్వెరపోయే విషయాలు..

నారాయణకు నోటీసులు..

నారాయణ బెయిల్ రద్దు పిటిషన్‌పై చిత్తూరు కోర్టు మధ్యాహ్నం విచారణ జరిపింది. అడిషనల్ ఏజీ పొన్నవోలు వాదనలతో కోర్టు ఏకీభవించింది. నారాయణకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న కేసుపై వాదనలు జరగనున్నాయి.

## ఏపీ ప్రజలు ఫ్రస్టేషన్‌లో ఉన్నారు: చంద్రబాబు

కుప్పం: ఏపీ ప్రజలు ఫ్రస్టేషన్‌లో ఉన్నారని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవస్థను ధ్వంసం చేస్తే మళ్లీ నిర్మించడం చాలా కష్టమన్నారు. ఏపీలో హత్యలు, అత్యాచారాలు, దాడులు మితిమీరిపోయాయని తెలిపారు. వ్యక్తి అభివృద్ధి కన్నా.. వ్యవస్థ అభివృద్ధి ముఖ్యమన్నారు. తాను వ్యవస్థ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తే.. ఇప్పుడున్న పాలకులు వ్యక్తి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తప్పుబట్టారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని ధ్వజమెత్తారు. చివరకు తనను కూడా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, మూర్ఖులు, రౌడీలు, అజ్ఞానులతో పోరాడాల్సిన పరిస్థితి ఎదురైందని చంద్రబాబు పేర్కొన్నారు.



## 20 లక్షల డిపాజిట్‌కు.. పాన్ లేదా ఆధార్ సంఖ్య తప్పనిసరి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇప్పుడో కొత్త రూల్‌ను తీసుకువచ్చింది. ఒకవేళ బ్యాంక్‌లో 20 లక్షలు డిపాజిట్ చేసినా లేక విత్‌డ్రా చేసినా.. ఆ సమయంలో ఆధార్ లేదా పాన్ నెంబర్‌ను వెల్లడించాలని ప్రభుత్వం తెలిపింది. ఒక వార్షిక సంవత్సరంలో 20 లక్షల లావాదేవీలు జరిగే అకౌంట్లకు పాన్ లేదా ఆధార్ తప్పనిసరి అవుతుంది. దీనికి సంబంధించి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) నోటిఫికేషన్ జారీ చేసింది. బ్యాంకుల్లో లేదా పోస్టాఫీసుల్లో కరెంట్ అకౌంట్ లేదా క్యాష్ క్రెడిట్ అకౌంట్‌ను ఓపెన్ చేస్తే కూడా పాన్ లేదా ఆధార్ సంఖ్యను చెప్పాల్సి ఉంటుంది.

## నిజాయతీగా పనిచేసే పోలీస్ అధికారిని బలి తీసుకున్నారు: లోకేష్

అమరావతి: నిజాయతీగా పనిచేసే పోలీస్ అధికారిని బలి తీసుకున్నారని టీడీపీ నేత లోకేష్ (ఒనీనివబష్ట) విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కక్షసాధింపు చర్యల వల్లే సర్పవరం ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎస్ఐ గోపాలకృష్ణ మృతిపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలి, ఎస్ఐ కుటుంబాన్ని ఆదుకోవాలని లోకేష్ డిమాండ్ చేశారు. గోపాలకృష్ణ పిస్టల్‌తో కాల్చుకుని ఎస్ఐ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రభుత్వం, జిల్లా ఎస్పీ వేధింపుల వల్ల గోపాలకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పోస్టింగ్ ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచేశారు. ట్రైనింగ్ పూర్తయ్యాక కొన్నాళ్ళు ట్రాఫిక్ విభాగంలో గోపాలకృష్ణ విధులు నిర్వహించాడు. ఆ తర్వాత స్టేషన్ బాధ్యతలు ఇవ్వకుండా సర్పవరం సర్కిల్లో పోస్టింగ్ వేశారు. అధికారుల తీరుపై కొన్నాళ్లుగా ఎస్ఐ గోపాలకృష్ణ మనస్తాపంతో బాధపడుతున్నాడు. తాజాగా పోలీస్ బాస్ వేధింపులు అధికంకావడంతో ఈ అఘాయిత్యానికి ఎస్ఐ పాల్పడినట్లు తెలుస్తోంది.



## వధువు సృజన ఇష్టపూర్వకంగానే సంబంధం కుదిర్చాం: సోదరుడు విజయ్



మధురవాడ: విశాఖ నగరంలోని మధురవాడలో పెళ్లి పీటలపైనే వధువు సృజన మృతిచెందిన ఘటనపై ఆమె సోదరుడు విజయ్ వివరణ ఇచ్చారు. సృజన ఆత్మహత్య చేసుకుందనే వార్తలను ఆయన ఖండించారు.

విశాఖలో మీడియాతో విజయ్ మాట్లాడారు.

సృజన ఇష్టపూర్వకంగానే సంబంధం కుదిర్చామని.. పెళ్లి ఇష్టంలేకే ఆత్మహత్యకు పాల్పడిందనే వార్తలు వాస్తవం కాదని చెప్పారు. పెళ్లిలో డేట్ (రుతుక్రమం) సమస్య రాకూడదనే సృజన కొన్ని మాత్రలు వేసుకుందని.. వాటి కారణంగా రెండు రోజులుగా ఇబ్బంది పడిందని విజయ్ తెలిపారు. సృజన హఠాన్మరణానికి కారణం తమకూ తెలియదని.. వైద్య నివేదికలు వస్తే తప్ప ఏమీ చెప్పలేమన్నారు. ఆమెది ఆత్మహత్య కాదని.. కారణాలేంటనేది తెలియాల్సి ఉందని చెప్పారు. ఇతర అనుమానాలేమీ తమ కుటుంబాల్లో లేవని విజయ్ తెలిపారు. మరోవైపు సృజన మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని సృజన స్వస్థలం రంగారెడ్డి జిల్లా చందానగర్‌కు తరలిస్తున్నారు. శవపరీక్షలో సేకరించిన అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.ఈశ్వరరావు, అనూరాధల కుమార్తె సృజనకు (22) విశాఖ పి.ఎం.పాలెంకు చెందిన నాగోతి అప్పలరాజు, లలితల కుమారుడు.. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీతో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం రాత్రి పదింటికి ముహూర్తంగా నిర్ణయించారు. సాయంత్రం విందులో వధూవరులిద్దరూ హుషారుగా అతిథులకు స్వాగతం పలికారు. వారి ఆశీర్వాదాన్ని పొందారు. పెళ్లి పీటలపై కూర్చున్నారు. వరుడు వధువు తలపై జీలకర్ర బెల్లం పెట్టే సమయంలో పెళ్లి కుమార్తె సృజన కుప్పకూలారు.

## దేవస్థానం అధికారులను నిలదీసిన గ్రామస్తులు

నంద్యాల నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామంలో శుక్రవారం నాడు దేవస్థానంకు సంబంధించిన భూముల వేలాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ ఊరిలో దేవాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి గురించి దేవస్థానం అధికారులు ఎన్ని సార్లు చెప్పినా స్పందించడం లేదన్నారు. ప్రతి సంవత్సరం వేలం పాట ద్వారా వచ్చిన డబ్బులను తీసుకుని అదిగో ఇదిగో దేవాలయాలను బాగు చేస్తామని గత 2007 సంవత్సరాల నుండి చెప్పుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం నాడు దాదాపు 87 ఎకరాల దేవస్థానం భూములకు వేలం పాట నిర్వహించుటకు వచ్చిన ఈఓ జయ చంద్ర రెడ్డి ని వారి సిబ్బందిని 2007-2022 వరకు వచ్చిన డబ్బులకు లెక్కలు చెప్పాలని గ్రామస్తులు నిలదీశారు .

# సంపాదకీయం

శనివారం 14-05-2022

## ఆర్థిక కష్టాల్లో.. ఓల్డ్ పార్టీ

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్.. దేశంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న పార్టీ. ఇప్పుడు గత వైభవాన్ని కోల్పోయి.. దేశం మొత్తంలో కేవలం రెండంటే రెండు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్న పార్టీ. తమ ప్రమేయం లేకుండానే ఏదో విధంగా మళ్లీ కేంద్రంలో అధికారం దక్కుతుందన్న ఆశతో ఎదురు చూస్తున్న గాంధీ కుటుంబం నేతృత్వంలో నడుస్తున్న పార్టీ. అయితే పార్టీ ఎలాగోలా అధికారంలోకి వచ్చేస్తుందని హైకమాండ్ కున్న నమ్మకం.. పార్టీలోని సీనియర్లలో లేకపోవడంతో చాలా వరకూ సీనియర్లు పార్టీకి గుడ్ బై చెప్పేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దేశంలోనే సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఎన్నికల సన్నాహాలకు వనరుల లేమితో పరేషాన్ అవుతోంది. ఈ నేపథ్యంలో అనివార్యంగా పార్టీలో ఉత్సాహాన్ని నింపాల్సిన బాధ్యతను అధినేత్రి సోనియాగాంధీ తీసుకున్నారు. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ఉదయపూర్ చింతన్ శిబిర్ నిర్వహించనున్న నేపథ్యంలో ఆమె అధ్యక్షతన సీడబ్ల్యుసి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో సోనియా ప్రసంగమే దేశ రాజకీయాలలో పెద్ద చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ పనైపోయిందా అన్న అనుమానాలకూ తెరతీసింది. పార్టీ పునర్వైభవానికి పార్టీ క్యాడర్ లో ఉత్సాహాన్నినింపాల్సిన అధినేత్రి సోనియా గాంధీ సీడబ్ల్యుసీ లో బేలగా ప్రసంగించారు. ఆ సమావేశంలో రాహుల్ గాంధీ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.గ్రాండ్ ఓల్డ్ పార్టీ వల్ల దేశంలో అందరూ లాభపడ్డారనీ.. అలా లాభపడినవారంతా ఇప్పుడు పార్టీ కోసం తమ వంతు సహాయం అందించాల్సిన సమయం వచ్చిందని సోనియా ఆ సమావేశంలో పిలుపు నిచ్చారు. నేరుగా చెప్పకపోయినా.. కాంగ్రెస్ ను అడ్డుపెట్టుకుని సంపాదించిన వారంతా ఇప్పుడు పార్టీకి ఆర్థిక సహకారం అందించాలన్నదే ఆ పిలుపు లక్ష్యమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దేశంలో కేవలం రెండంటే రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి పార్టీలో నైరాశ్యాన్ని నింపింది. ఈ పరిస్థితుల్లో క్యాడర్ లో ఉత్సాహాన్ని నింపి వారిని వచ్చే ఎన్నికలలో క్రియా శీలంగా పని చేసేలా దిశానిర్దేశం చేయాల్సిన అధినేత్రి బేలగా.. పార్టీని ఆదుకోవడానికి ముందుకు రండి అంటూ అభ్యర్థించడం పై రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీలో దశ, దిశ చూపే నాయకత్వం కరవైందనడానికి సీడబ్ల్యుసీలో సోనియా ప్రసంగమే నిదర్శనమంటున్నారు. మరో వైపు అంతకు ముందు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గా రెడ్డి కూడా రేవంత్‌పై బహిరంగంగానే విమర్శలు చేశారు. తనను కోవర్ట్ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తూ అవమానిస్తున్నారంటూ ఏకంగా రాజీనామాకు కూడా సిద్ధపడిపోయారు. అయితే సీనియర్ నేతల సూచనలతో కాస్త వెనక్కి తగ్గారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో భేటీ అనంతరం జగ్గా రెడ్డి కాస్త శాంతంగానే కనిపిస్తున్నారు. రేవంత్‌తోనూ అభిప్రాయభేదాలు సద్దుమణిగినట్లు కనిపిస్తోంది. రాహుల్ పర్యటనకు సంబంధించిన పనుల్లో ఇద్దరూ కలిసి పనిచేయడంతో ఇద్దరి మధ్య విభేదాలు సద్దుమణిగినట్టేనన్న సంకేతాలిచ్చారు. మరోవైపు వీహెచ్ లాంటి సీనియర్ నేతలు కూడా తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ పీసీసీపై గుస్సా అవుతున్నారు. తాను ఢిల్లీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని ఇప్పటికే పలుమార్లు ఆయన హెచ్చరించారు కూడా. అటు అద్దంకి దయాకర్ ప్రెస్‌మీట్ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ చర్యల వరకూ వెళ్లింది. ఇలాంటి నేపథ్యంలో రాహుల్ గాంధీ హెచ్చరికలు హాట్ టాపిక్‌గా మారాయి. మీడియాకెక్కి రచ్చచేయొద్దంటూ అగ్రనేత రాహుల్ గాంధీతో చెప్పించడం ద్వారా పార్టీ లైన్ దాటకుండా సీనియర్ నేతలను కట్టడి చేయడంలో రేవంత్ ఒకింత సక్సెస్ అయినట్టే చెప్పొచ్చు. రాహుల్ గాంధీ పార్టీ టిక్కెట్లపై కూడా క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్‌లో కూర్చుంటేనో.. ఢిల్లీ చుట్టూ తిరిగితేనో టిక్కెట్లు ఇచ్చేది లేదని.. ప్రజల మధ్యలో ఉండే నాయకులకే టిక్కెట్ ఇస్తామని తేల్చిచెప్పేశారు. సీనియర్ నేతలైనా ప్రజల మధ్యలో తిరగాల్సిందేనని.. సర్వేలు నిర్వహించి ప్రజామోదం ఉన్నవారికే టిక్కెట్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకునేది లేదని.. ఒకవేళ ఎవరైనా అలా అనుకుంటే ఆ పార్టీలోకే వెళ్లిపోవాలంటూ అల్టిమేటం ఇచ్చేశారు. దీంతో అసమ్మతి నేతలకు బుజ్జగింపులు లేవని.. వెళ్లిపోయినా ఏం ఫర్వాలేదంటూ తేల్చిచెప్పినట్టైంది.

# పొత్తుల పంచాయితీ

విజయవాడ, మే 13, ఏపీలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లున్నా అప్పుడే పొత్తుల పంచాయితీ కాకరేపుతోంది. సింహం సింగిల్‌గానే వస్తుందంటూ వైసీపీ కాలుదువ్వుతుంటే.. ప్రతిపక్ష టీడీపీ, జనసేన మాత్రం ఆచితూచి అడుగులేస్తున్నాయి. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రావాలని జగన్ పార్టీ సవాల్ చేస్తోంటే.. ఎలా రావాలో మాకు తెలుసంటూ దీటుగానే బదులిచ్చాయి. భవిష్యత్‌లో ఏమైనా జరగొచ్చంటూ సంకేతాలు కూడా ఇచ్చేశాయి. జగన్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఉత్తరాంధ్ర పర్యటనతో అది తేలిపోయిందని చంద్రబాబు స్పష్టం చేశారు. అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై పోరాడేందుకు అందరూ కలిసి రావాల్సి అవసరం ఉందంటూ పాతమిత్రులకు మరోమారు స్నేహహస్తం చాటారు. అదే సమయంలో జనసేనాని పవన్ సైతం ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతే రాష్ట్రంలో అంధకారమేనంటూ వ్యాఖ్యలు చేయడం.. పొత్తులపై మరింత ఆసక్తి రేపుతోంది గతంలో గ్రాండ్ సక్సెస్.. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. జనసేన బరిలో దిగనప్పటికీ బయటి నుంచి మద్దతునిచ్చింది. ఆ ఎన్నికల్లో భారీ అంచనాలతో ఒంటరిగానే బరిలోకి దిగిన వైఎస్ జగన్ పార్టీ పరిస్థితి తల్లకిందులైంది. జగన్ గెలవబోతున్నారంటూ సర్వేలు గగ్గోలు పెట్టినా అనూహ్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించి అబ్బురపరిచింది. టీడీపీ అధినేత అనుభవం, రుణమాఫీ వంటి హామీలు చివరి క్షణాల్లో సీన్ మార్చేశాయన్న విశ్లేషణలు వచ్చాయి. అయితే ఆ తర్వాత కొన్నాళ్లకే టీడీపీకి తన మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనతో చెడింది. పసుపు పార్టీ అధినేత చంద్రబాబు ఏకంగా కాషాయం పార్టీని టార్గెట్ చేయడం కమలనాథులకు మింగుడుపడలేదు. గత ఎన్నికల్లో తమ విజయానికి సాయం చేసిన పవన్‌ను సైతం పట్టించుకోకపోవడంతో ఆయన కూడా దూరమయ్యారు. వైసీపీ అధినేత జగన్ మరింత కసిగా ఫోకస్ పెట్టారు. భారీ పాదయాత్ర చేపట్టి ఊరూరా తిరుగుతూ ప్రజలకు దగ్గరయ్యారు. ఒక్క అవకాశంటూ అన్ని వర్గాలను ఆకట్టుకున్నారు. 2019 ఎన్నికల్లోనూ ఒంటరిగానే బరిలోకి దిగారు. రెండోసారి భారీ అంచనాలతోనే బరిలోకి దిగిన వైసీపీ ఈ సారి తన లక్ష్యాన్ని ఛేదించింది. పాత రికార్డులను బద్దలుకొడుతూ గ్రాండ్ విక్టరీ సొంతం చేసుకుంది. ఏకంగా 151 సీట్లతో అధికార పీఠం దక్కించుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా ఒంటరిగా బరిలోకి దిగడం వైఎస్ జగన్‌కు కలిసొచ్చింది. వైసీపీ విజయం ఖాయమని అంచనాలు ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన దోస్తీ బెడిసికొట్టడంతో మరింత కలిసొచ్చిందనే వాదనలున్నాయి. . ఇక ఒంటరిగా బరిలోకి దిగిన టీడీపీ, జనసేన ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయాయి. అధికార పక్షంగా బరిలోకి దిగిన టీడీపీ 2019 ఎన్నికల్లో చావు దెబ్బతింది. వ్యతిరేక ఓటు వైసీపీ ఖాతాలో నేరుగా పడినప్పటికీ.. బలంగా ఉన్న స్థానాల్లోనూ తెలుగుదేశం విజయం సాధించలేకపోయింది. జనసేన పార్టీ టీడీపీ విజయావకాశాలను దెబ్బతీసింది. ఒకే ఒక్క సీటుతో అసెంబ్లీలోకి ఎంట్రీ ఇచ్చిన జనసేన చాలా స్థానాల్లో 30 నుంచి 50 వేల ఓట్ల వరకూ దక్కించుకుంది. టీడీపీ అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన స్థానాల్లో జనసేనకు భారీగా ఓట్లు పోలవడం గమనార్హం. ఒకవేళ పాతమిత్రులుకలిసి పోటీ చేసి ఉంటే అంత ఘోరంగా విఫలమయ్యేవారు కాదేమో గత ఎన్నికల ఫలితాలతో కాస్త ముందుగానే మేల్కొన్న టీడీపీ అధినేత చంద్రబాబు పొత్తులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసి పొలిటికల్ హీట్ రాజేశారు. జగన్ సర్కార్‌పై ఇప్పుడిప్పుడే పెరుగుతోన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకునేందుకు సిద్ధమయ్యారు. రాజకీయ వ్యూహాల్లో తలపండిన చంద్రబాబు కలిసి నడుద్దామంటూ ముందే ఓ మెట్టు దిగారు. ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా అందరం కలిసి పోరాడాల్సిన అవసరముందని నొక్కిచెప్పడం ద్వారా పొత్తులు అనివార్యమనే సంకేతాలిచ్చారు. గతంలోనూ ఒకరే ప్రేమిస్తే కుదరదు.. అవతలి వాళ్లు కూడా ప్రేమించాలంటూ పొత్తులపై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అయితే జనసేనాని పవన్ కళ్యాణ్ మాత్రం ఆచితూచి స్పందించారు. పొత్తులకు సిద్ధమని చెప్పకుండానే ప్రభుత్వ ఓటు చీలకుండా ఉండాలంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ డబుల్ స్ట్రాటజీ.. అయితే అధికార వైసీపీ మాత్రం విపక్షాలపై కాలుదువ్వడమే వ్యూహంగా ప్రత్యర్థులపై విరుచుకుపడుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినప్పటికీ.. ప్రతిపక్షాలను ఒక్కటి కానివ్వకూడదనే వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే పవన్‌ను చంద్రబాబు దత్తపుత్రుడంటూ ప్రచారం చేస్తోంది. ఇద్దరూ ఒక్కటేనని బలమైన ముద్ర వేసేందుకు యత్నిస్తోంది. ఇద్దరూ వేర్వేరుగా ఉంటే మంచిది.. కలిసిపోతే మరీ మంచిదనే దిశగా పావులు కదుపుతోంది. టీడీపీ, జనసేన ఒంటరిగా బరిలోకి దిగితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవడం ఖాయం. అదే జరిగితే వైసీపీ సేఫ్. ఒకవేళ టీడీపీ, జనసేన జతకడితే ఇద్దరూ కలిసి మరోమారు మోసం చేసేందుకు వస్తున్నారనే పాత నినాదంతోనే చెక్ పెట్టాలని వైసీపీ డబుల్ స్ట్రాటజీ వర్కౌట్ చేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రెంటికీ చెడ్డ రేవడిగా వల్లభనేని



విజయవాడ, మే 13, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. గత ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్‌పై వంశీ గెలిచినా.. జగన్ పార్టీ అధికారంలోకి రావడంతో.. ఆ పార్టీలోకి వెళ్లితే.. తనకు అందలం దక్కుతుందని ఆయన భావించారు. కానీ అనుకున్నది ఒకటి అయింది మరొకటి. దీంతో తన సీన్ ఇంతలా సితారవుతుందని అనుకోలేదని వల్లభనేని వంశీ మధనపడుతున్నారట. రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు వైసీపీ కార్యక్రమానికి ఆ పార్టీ నేతలు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే ఇది మా పార్టీ ఫ్యామిలీ పండగ.. మేం మాత్రమే చేసుకుంటామంటూ ఫ్యాన్ పార్టీ నేతలు దీర్ఘాలు తీస్తూ కండీషన్లు పెట్టి ఈ కార్యక్రమానికి వల్లభనేని వంశీని దూరం పెట్టేశారుట. దీంతో టీడీపీలో గెలిచి.. ఫ్యాన్ పార్టీలోకి జంప్ కొట్టిన వల్లభనేని వంశీకి ఆయన వర్గానికి అనుకోని విధంగా ఎదురు దెబ్బ తగిలినట్లైంది. అంతే కాకుండా నియోజకవర్గంలో వల్లభనేని వంశీ వ్యతిరేకులు అంటే డాక్టర్ దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావ్ తదితరులు ఏక తాటిపైకి వచ్చి.. గడపగడపకూ కార్యక్రమం అంతా తామే అన్నట్లు వ్యవహరిస్తూ.. నియోజకవర్గమంతటా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో చేసేదేమీ లేక వల్లభనేని వంశీ, ఆయన వర్గం నోటిపై వేలేసుకుని మరీ సైలెంట్ అయిపోయారట. 2014 ఎన్నికల తర్వాత చంద్రబాబు అధికారంలో రావడంతో... ప్రతిపక్షంలోని వైయస్ జగన్ పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలకు .. నిధులు ఇచ్చి.. తననూ ప్రోత్సహిస్తారని వల్లభనేని వంశ ఆశించారట. ఆ క్రమంలో తన స్నేహితుడు, మాజీ మంత్రి కొడాలి నానితో కలిసి.. టీడీపీకి వ్యతిరేకంగా గట్టిగానే గళమెత్తారు. ఆ క్రమంలో చంద్రబాబుతోపాటు ఆయన భార్య నారా భువనేశ్వరిపై వల్లభనేని వంశీ అనుచిత వ్యాఖ్యలు చేసి.. తానేమి కొడాలి నాని కంటే తక్కువ కాదనట్లు నిరూపించుకొన్నారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలన్నీ తెలిసినవే. టీడీపీకి తనకు తానుగా దూరమైన వల్లభనేని వంశీని.. ఫ్యాన్ పార్టీ నేతలు మాత్రం కావాలని దూరంగా పెట్టారట. ఆ క్రమంలోనే ఫ్యాన్ పార్టీలోని వంశీ వ్యతిరేక వర్గం.. ఏకంగా పార్టీలో కీలక నేత విజయసాయిరెడ్డికి కొండవీటి చాంతాడంత లేఖ రాసి మరీ వంశీకి గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తే.. ఫ్యాన్ పార్టీ గెలుపు కష్టమవుతోందని వంశీకి కాకుండా ఎవరికి అవకాశం ఇచ్చినా తామంతా కష్టపడి మరీ పార్టీని గెలుపించుకొనేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారట. వల్లభనేని వంశి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారడానికి కారణమేమిటన్నదానికి మరోవైపు వల్లభనేని వంశీని అటు టీడీపీ వాళ్లు.. ఇటు వైసీపీ వాళ్లు ఎందుకిలా పగ పట్టారంటే మాత్రం.. గన్నవరం నియోజకవర్గంలో ఓ టాక్ జోరుగా వైరల్ అవుతోంది. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ క్రమంలో గన్నవరం నుంచి గెలిచిన వల్లభనేని వంశీ చాలా దూకుడుగా వ్యవహరించారట. ఎలా అంటే నాటి ప్రతిపక్షంలో ఉన్న వైయస్ఆర్సీపీ శ్రేణులపై కేసులు పెట్టించారట. అలాగే వారి ఆర్థిక మూలాలను సైతం ఆయన తీవ్రంగా దెబ్బ కొట్టారట. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధికార పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలకు సైతం ఈ వల్లభనేని వంశీపై కన్నెర్రగా ఉందన్నదే ఆ టాక్. అదీకాక రానున్న ఎన్నికల్లో గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ యార్లగడ్డ వెంకట్రావ్ బరిలోకి దిగాలని భావిస్తుండగా.. మరో వైపు వైఎస్ ఫ్యామిలీకి అత్యంత ఆప్తుడు దుట్టా రామచంద్రరావు అల్లుడిని రంగంలోకి దింపేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో వీరిద్దరు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారట. దుట్టా రామచంద్రరావు అల్లుడు వైయస్ జగన్ భార్యకు సమీప బంధువు అని తెలుస్తోంది.ఆ క్రమంలో ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అయితే వల్లభనేని వంశీకి మాత్రం టికెట్ రాకూడదనే విధంగా కూడా వీరు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారంమరోవైపు.. వచ్చే ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని ఇప్పటికే చంద్రబాబు స్కెచ్ వేశారు. ఎందుకంటే.. ఫ్యాన్ పార్టీ అధినేత జగన్ ఓ వేళ.. ఎవరినీ కాదని.. వల్లభనేని వంశీకి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా.. అతడి ఓడించాలనే ఓ విధమైన దృఢ సంకల్పంతో సైకిల్ పార్టీ అధినేత ఉన్నట్లు తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. వల్లభనేని వంశీ.. పార్టీ మారి తప్ప చేశారని.. ఓ వేళ పార్టీ మారినా ఆయన చంద్రబాబు ఫ్యామిలీ గురించి అలా మాట్లాడకుండా ఉండాల్సిందనే ఓ అభిప్రాయం అయితే గన్నవరం నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది.

# పాపం... ఆర్కే...

గుంటూరు, మే 13, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అయితే.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సహా కొందరు వైసీపీ నేతల మాటల్ని బట్టి, సీఎం జగన్ పార్టీ నేతలతో చేస్తున్న సమీక్షలు, ఇప్పటి నుంచే వారికి పార్టీ పరంగా అప్పజెబుతున్న బాధ్యతల నేపథ్యంలో ముందస్తు ఎన్నికలు రావచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నగరం అమరావతి ప్రాంతంలో ముఖ్యమైన, చారిత్రక మంగళగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఈసారి గడ్డుకాలం ఎదుర్కోక తప్పదనే అంచనాలు వస్తున్నారు. ఆర్కే 2014లో తొలిసారిగా వైసీపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై 5 వేల 337 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2019 నుంచి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సీఆర్ డీఏ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు.మంగళగిరి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన నియోజకవర్గం ప్రజలకు ఆర్కే చేసిన మేలు ఏమిటనేది చూస్తే.. అతి స్వల్పమే అంటారు స్థానికులు. నియోజకవర్గం బాగోగుల గురించి అంతగా పట్టించుకోని ఆర్కే.. ఎంతసేపూ సీఆర్ డీఏ ఛైర్మన్ హోదాలో అమరావతిలో అసైన్డ్ భూముల కొనుగోలు, అమ్మకాలపై ఫిర్యాదులు చేయడానికే సమయం అంతా వెచ్చిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. అమరావతి భూముల విషయంలో ప్రతినిత్యం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పైన, టీడీపీ హయాంలో మున్సిపల్ మంత్రిగా వ్యవహరించిన పొంగూరు నారాయణపైన ఆరోపణలు చేయడం, ఫిర్యాదులు చేయడంపైనే ఉంటారని చెబుతారు.రాజధాని అమరావతి నిర్మాణం కోసం తాము సంతోషంగా తమ భూములు ఇస్తే.. చంద్రబాబు బలవంతంగా లాక్కున్నారంటూ ఆర్కే ఆరోపణలు చేయడం సరికాదని కొందరు దళితులు ఖండించడం విశేషం. దళితులను అవహేళన చేస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే ఆర్కేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని దళితులు తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం అనూహ్య పరిణామమే. ఆర్కేకి నిజంగా మంగళగిరిపై, దళితులపై ప్రేమ ఉంటే.. అమరావతిని అభివృద్ధి చేసి చూపించాలనేది దళితుల సవాల్. అమరావతి నిర్మాణం కోసం రైతుల భూమిని బలవంతంగా లాక్కున్నారన్న ఎమ్మెల్యే ఆర్కే వ్యాఖ్యలను పలువురు రాజధాని ప్రాంత రైతులు కూడా ఖండించడం గమనార్హం. అమరావతి భూముల విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే రాజకీయం చేస్తున్నారని వారు తూర్పారపడుతుండడం గమనించదగ్గ విషయం.ప్రతినిత్యం వైసీపీ అధినేత వైఎస్ జగన్ భజనతోనే ఎమ్మెల్యే ఆర్కే తరిస్తుంటారని, నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఈ ఎనిమిదేళ్లలో ఆయన చేసిందేమీ లేదని ప్రజలు పెదవి విరుస్తుండడం విశేషం. ఒకసారి గెలిపిస్తే.. ప్రతిపక్షంలో ఉండడం వల్లే అభివృద్ధి చేయలేకపోయారని సరిపెట్టుకున్నామని, ఈ సారి అధికారపక్షంలో ఉన్నా ఆర్కే తమకేమీ ఒరగబెట్ట లేదని వారు ప్రత్యక్షంగానే వారు విమర్శిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరిగినా.. లేదా ముందుగా జరిగినా.. ఆర్కే గెలిచే పరిస్థితి ఉండబోదని స్థానికులే చెబుతుండడం గమనార్హం.మరో పక్కన ఈ సారి కూడా మంగళగిరి నుంచే పోటీ చేయాలని టీడీపీ యువనేత, మాజీ మంత్రి నారా లోకేష్ డిసైడ్ అయ్యారనే అంచనాలే వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన కొన్నాళ్లుగా మంగళగిరిలోనే అనునిత్యం గడుపుతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం అయ్యేసరికి నియోజకవర్గంలో ఏడో ఒక చోట ప్రజల మధ్య లోకేష్ ప్రత్యక్షం అవుతున్నారు. 'పోగొట్టుకున్న చోటే వెదుక్కోవాలి' అన్న లోకోక్తి ప్రకారం గతంలో మంగళగిరిలోనే ఓడిన నారా లోకేష్ ఇదే నియోజకవర్గంలో రెట్టించిన పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఎవరికి ఏమి కష్టం వచ్చినా.. వెంటనే అక్కడ వాలిపోతున్నారు. బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని, వైసీపీ నేతలను, సీఎం జగన్ ను నిలబెట్టి కడిగేస్తున్నారు. గతంలో తానెవరో నియోజకవర్గం ప్రజలకు అంతగా తెలియకపోయినా సిటింగ్ ఎమ్మెల్యే ఆర్కేకు గట్టి పోటీనే ఇచ్చారు. వారిద్దరి మధ్యా ఓట్ల తేడా స్వల్పమే. ఇప్పుడు నియోజకవర్గం ప్రజల మధ్యే నిరంతరం ఉండడంతో లోకేష్ అంటే మరింత క్రేజ్ వచ్చిందంటున్నారు.గత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆర్కే పేదలకు 4 రూపాయలకే భోజనం, 10 రూపాయలకే సంచి నిండా కూరగాయలు లాంటి టక్కు టమార విద్యలు ప్రదర్శించారంటారు.

# సీబీఐ వైపు... అందరి చూపు

కడప, మే 13,వైఎస్ వివేకానందరెడ్డి హత్య కు అసలు సూత్రధారిని సీబీఐ కనిపెట్టారని.. ఆ సూత్రధారికి సంబంధించిన ఆధారాల కోసమే ఆగుతున్నారన్న ప్రచారం పులివెందులలో విస్తృతంగా జరుతోంది. వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలను అరెస్ట్ చేస్తే కేస్ క్లోజ్ అయిపోతుందనుకుంటే? జగన్ ఎప్పుడో చేయనిచ్చేవారని.. కానీ ఆ కేసు తర్వాత ఓ శివగామి వద్దకు వస్తుందనే .. కేసును ముందుకు వెళ్లకుండా చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయం కడప జిల్లాలో సంచలనంగా మారింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు మొదటి నుంచి సంచలనాత్మకంగా మారింది. ఎందుకంటే అంతా బహిరంగమే .. కానీ ఒక్కరూ బయటకు చెప్పరు. ఎవరు చేశారు.. ఎలా చేశారు.. ఎందుకు చేశారు.. అంతా ఓపెన్ సీక్రెట్. కడప ప్రజలందరూ.. తమ పిచ్చాపాటి కబుర్లలో అసలు హంతకులెవరో చెప్పుకుంటూ ఉంటారు. అయితే కేసులు పెట్టడానికి అరెస్ట్ చేయడానికి కావాల్సింది సాక్ష్యాలు. ఈ విషయంలో అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి కావాల్సిన సాక్ష్యాలున్నాయి. కానీ ఇంకా అరెస్ట్ చేయడం లేదు. సీబీఐ అధికారులు వివేకా హత్య కేసుకు సంచలన ముగింపు ఇవ్వాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.అందుకే ఈ హత్య కేసులో అసలు సూత్రధారిని బయటకు తీయాలని పట్టుదలగా ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇది బయటపడితే రాజకీయంగానూ సంచలనం అవుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి సీబీఐ సైలెంట్‌గా ఉంది.. ఏం చేస్తుందనేది ఎవరికీ తెలియడంలేదు. కానీ వీరోచితంగా ముందడుగా వేసి? వైఎస్ వివేకా హత్య కేసు నిందితుల్ని పట్టుకోవాలంటే.. సంచలనాలు నమోదు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# క్రుంగిపోతున్న వంతెన

విశాఖపట్టణం, మే 13, అనకాపల్లి జిల్లాలో దశాబ్దాలుగా ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగపడిన వంతెన ఉన్నట్టుండి కుంగిపోయింది. పిల్లర్ పక్కకు ఒరిగిపోవడంతో పెద్దేరు వంతెన కుంగింది. దీంతో నర్సీపట్నం-చోడవరం మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.అనకాపల్లి జిల్లాలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఓ వంతెన కుంగిపోయింది. బుచ్చయ్యపేట మండలం వడ్డాది సమీపంలోని పెద్దేరు నదిపై ఉన్న వంతెన బుధవారం రాత్రి 12 గంటల సమయంలో కుంగిపోయింది. మధ్య భాగంలో ఉన్న పిల్లర్ పక్కకు ఒరిగిపోవడంతో... వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో చోడవరం-నర్సీపట్నం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.ఇటీవల కాలంలో పెద్దేరు జలాశయం నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినప్పుడు, ఇతర గెడ్డలు కలసి నీరు ఉధృతంగా ప్రవహించినప్పుడు కూడా ఈ వంతెన చెక్కుచెదరలేదు. ఎనో వరదలు, తుఫాన్లను తట్టుకొని నిలబడిన ఈ బ్రిడ్జి మధ్యలో కుంగిపోవడానికి ఈ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలే కారణమనే ఆరోపణలు ఉన్నాయి.అధిక బరువుతో ఉన్న గ్రానైట్ లారీలు తరచూ బ్రిడ్జిపై నుంచి ప్రయాణించడం కూడా వంతెన దెబ్బతినడానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. నర్సీపట్నం వెళ్లే మార్గానికి ఈ వంతెన వడ్డాది ప్రాంత ముఖద్వారం కావడంతో.. చోడవరం నుంచి నర్సీపట్నం, పాడేరు నుంచి రాజమండ్రి వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రస్తుతం ఈ వంతెన పైకి పాదచారులు, టూవీలర్లను మాత్రమే అనుమతిస్తున్నారు.ఈ విషయమై అనకాపల్లి జిల్లా ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ మాట్లాడుతూ.. శారదానదిపై తాత్కాలిక వంతెన ఏర్పాటుకు సుమారు నెల రోజులు పడుతుందన్నారు. దీనికి 50-60 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నదిపై కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయన్నారు.

# ఏబీవీ నెక్స్ట్ ఏంటీ..

విజయవాడ, మే 13,ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగ్ ఇచ్చే ఉద్దేశం జగన్ సర్కార్ కు లేదని వరసగా జరుగుతున్న సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఏబీవీకి పోస్టింగ్ ఇవ్వకుండా ఉండటం కోసం జగన్ సర్కార్ ఏకంగా సుప్రీం తీర్పును కూడా ఉల్లంఘించి పర్యవసానాలను ఎదుర్కొనడానికి సిద్ధపడినట్లు కనిపిస్తున్నది.తన నిర్ణయాలను తప్పుపడితే కోర్టులపై కూడా విమర్శలు గుప్పించి, జడ్జీలకు ఉద్దేశాలను ఆపాదించడం జగన్ సర్కార్ కు ఒక అలవాటుగా మారింది. ఈ విషయంలో న్యాయస్థానాలు ఎన్నిసార్లు అక్షింతలు వేసినా జగన్ సర్కార్ తీరు మారడం లేదు. ఇప్పుడు ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో కూడా ఏపీ సర్కార్ నేరుగా సుప్రీం కోర్టు ఆదేశాలనే బేఖాతరు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. సీనియర్ ఐపీఎస్ ఏబీవీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ ముగిసిందని ఆయనకు తక్షణం పోస్టింగ్ ఇవ్వాలని సుప్రీంకోర్టు విస్పష్ట ఆదేశాలిచ్చి రెండు వారాలు గడిచినా, ఇంత వరకూ ప్రభుత్వం ఆ ఆదేశాల అమలుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.పైపెచ్చు తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ సీఎస్ ను కలిసిన వెంటకేశ్వరరావుకు అవమానమే ఎదురైంది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఓ సారి చీఫ్ సెక్రటరీని కలిసి సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చయాలని కోరిన ఏబీవీకి ప్రొసెల్ లో పెడతామన్న సమాధానం వచ్చింది.

# దుర్గమ్మ సొమ్ముకే రక్షణ కరువా...




విజయవాడ, మే 13, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం... రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటి. నిత్యం వేలాది మంది భక్తులు రాక.. రోజుకు రూ.13.90 లక్షలకు పైగానే హుండీ ఆదాయం... ఇక దసరా, భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు ముగిస్తే కానుకల లెక్కింపు మూడు, నాలుగు రోజులు సాగాల్సిందే! రోజుకు వెయ్యి నుంచి 30 వేల పైబడి భక్తులకు పెరిగినా... కానుకల లెక్కింపులో మాత్రం దేవస్థానం ఇంకా మూస పద్ధతినే అవలంభిస్తున్నారు. దీంతో అమ్మవారి కానుకలు, మొక్కుబడులు చేతి వాటానికి గురవుతున్నాయి.గడిచిన ఐదేళ్ల కాలంలో పదికి పైగా ఘటనలు చోటు చేసుకున్నాయి. కొన్ని ఘటనల్లో ఆలయ సిబ్బంది నేరుగా ఉంటే మరి కొన్ని సంఘటనల్లో సేవా సిబ్బంది, అవుట్ సోర్స్ సిబ్బంది ఉంటున్నారు. టీ కప్పులో

## మూస పద్ధతిలో కౌంటింగ్


బంగారం తాడు దాచి దొరికి పోయిన వైనం ఒకటయితే.. హుండీల నుంచి కానుకలను మహా మండపానికి తరలించేందుకు తీసుకెళ్లే ప్లాస్టిక్ సంచులలో బంగారాన్ని దాచి పెట్టి దొరిపోయిన వైనం మరోటి. సేవకు వచ్చి బంగారం, డబ్బు చక్క బెట్టేసిన వైనం ఇంకొకటి.. ఇలా బయట పడిన ఘటనలు కొన్ని.. ఇంక బయట పడని ఘటనలు ఎన్ని ఉన్నాయోననే అనుమానాలు భక్తులు వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానానికి కానుకలు, మొక్కుబడులు పెరుగుతున్న తరుణంలో ప్రతి వారం లేదా పది రోజులకు ఒక సారి లెక్కింపు జరిగితే ఇటువంటి ఘటనలకు చెక్ పెట్టవచ్చునని భక్తులు అభిప్రాయపడుతున్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను ప్రస్తుతం 15 రోజులకు ఒక సారి చేపడుతున్నారు. దీంతో ఆలయంలోని అన్ని హుండీల నుంచి ఒకే సారి కానుకలను లెక్కింపుకు తీయడంతో అవి వంద నుంచి 120కి పైగా మూటలవుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు కానుకలను లెక్కించడం ఆలయ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంది. లెక్కింపుకు ఆలయ సిబ్బందితో పాటు సేవా సిబ్బందిని అనుమతిస్తారు. దీంతో కానుకల లెక్కింపు ప్రాంతమంతా గందరగోళంగా మారడమే కాకుండా ఎవరు ఏం చేస్తున్నారో అర్ధం కాని పరిస్థితి. సోమవారం కూడా ఇదే జరిగింది. ఆలయ సిబ్బంది గంటల తరబడి నేలపై కూర్చోవడం ఇబ్బందికరమే. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆదమరుపుగా ఉన్న తరుణంలో చేతివాటాన్ని ప్రదర్శించి కానుకలను పక్కదారి పట్టించారు. వారంలో ఒక రోజు కానుకల లెక్కింపు క్రమం తప్పకుండా జరిగితే సాయంత్రానికి లెక్కింపు పూర్తవుతుందని ఆలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీని వల్ల బయటి వ్యక్తులను లెక్కింపునకు పిలవాల్సిన అవసరం కూడా ఉండదని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు. దేవస్థానంలో ప్రస్తుతం పరిపాలనా విభాగం, పూజల విభాగం, ఇంజనీరింగ్



విభాగం, శానిటేషన్ విభాగాలతో పాటు మరి కొన్ని విభాగాలు ఉన్నాయి. అయితే అమ్మవారికి భక్తులు అందచేసే విరాళాలు, కానుకలను ఒక విభాగంగా చేసి బాధ్యులను అప్పగిస్తే ఫలితాలు బాగుంటాయని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయానికి, అన్నదానం, అభివృద్ధి పనులకు దాతలు విరాళాలు అందచేస్తుంటారు. అయితే ఈ విరాళాల సేకరణ ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని గతంలో పలువురు ఈవోలు ప్రతిపాదనలు సిద్ధం చేసినా అవి కార్యరూపం దాల్చలేదు. విరాళాల సేకరణతో పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల పర్యవేక్షణ రెండు కలిసి ఒక విభాగం చేసి ఎఈవో స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయి. 15 రోజలకు ఒక సారి లెక్కింపు జరగడం కానుకలు లెక్కించే ప్రాంతంలోకి వచ్చే సిబ్బందికి మాత్రమే తనిఖీలు ఉండటం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు లెక్కింపు జరగడం సేవా సిబ్బంది పేరిట కొంత మంది సిఫార్సు చేసిన వారిని లెక్కింపులోకి అనుమతించడం లెక్కింపు జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా, ఏదైనా ఘటన జరిగిన సమయంలో అవి ఉపయోగకరంగా లేకపోవడం కానుకల లెక్కింపులో పాల్గొనే పోలీసు, సెక్యూరిటీ, హోంగార్డులను సైతం తనిఖీలు లేకపోవడంతో సిబ్బంది ఆడింది ఆట..పాడింది పాటగా మారిపోయింది

# మామిడి ధరలు ఆశాజనకం

విజయవాడ, మే 13, ఆసియాలోనే అతిపెద్దదైన నున్న మామిడి మార్కెట్ వ్యాపారులతో కళకళలాడుతోంది. ఫిబ్రవరిలోనే మామిడి ఎగుమతులు తోటల నుంచి నామమాత్రంగా ప్రారంభమైనప్పటికీ.. నున్న మార్కెట్ నుంచి మాత్రం మార్చి 20 నుంచి మొదలయ్యాయి. ఏప్రిల్ రెండో వారం నుంచి ఎగుమతులు ఊపందుకున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, స్థానిక వ్యాపారులు రైతుల నుంచి మామిడి పండ్లను కొనుగోలు చేసి ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, లక్నో, కోల్‌కతా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంలో 8.41 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రస్తుతం నూజివీడు, విస్సన్నపేట, మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం, తెలంగాణలోని కల్లూరు ప్రాంతాల నుంచి నున్న మార్కెట్‌కు మామిడి పండ్లు వెల్లువలా వస్తున్నాయి. రోజుకు 300నుంచి 400 టన్నుల పండ్లు దేశంలోని వివిధ మార్కెట్లకు ఇక్కడి నుంచి వెళ్తున్నాయి. ఇప్పటివరకు నున్న మార్కెట్ నుంచి 2 వేల టన్నులకు పైగా కాయలు ఎగుమతి అయినట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో పూత ఆలస్యంగా వచ్చింది. జనవరిలో కొంత పూత వచ్చినప్పటికీ వైరస్ బారిన పడటంతో పిందెకట్టకుండానే రాలిపోయింది. గతంలో



ఎకరానికి 4?5 టన్నుల దిగుబడి రాగా.. ప్రస్తుతం సగానికి పైగా తగ్గిపోయే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఊరట లభిస్తుందంటున్నారు. గత ఏడాది మార్చి నెలాఖరులో బంగినపల్లి టన్ను ధర రూ.30?35వేలు ఉండగా, ఈ ఏడాది రూ.70?80 వేల వరకు ధర పలుకుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం టన్ను మామిడిపండ్ల ధర రూ.55 వేల వరకు పలుకుతోంది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రసాలకు మంచి గిరాకీ ఉంది. కాయలు పక్వానికి రావడంతో తోటల్లోనే కాయ రూ.15? రూ.20 వరకు అమ్ముతున్నారు. పెద్ద రసాలు ఒక్కో కాయ రూ.25నుంచి రూ.30 పలుకుతోంది. సరుకు పూర్తి గా మార్కెట్‌లోకి వస్తే కొంత మేర ధరలు అందుబాటులోకి వస్తాయని వ్యాపారులు భావిస్తున్నారు.

# దిశ యాప్ పై అవగాహన

మచిలీపట్నం బందరు సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో మచిలీపట్నం గోల్డ్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన "దిశ యాప్ మెగా రిజిస్ట్రేషన్ డ్రైవ్" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష, జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జెడ్పి చైర్ పర్సన్ ఉప్పాల హారిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు, వాలంటీర్లు, వెలుగు గ్రూప్స్, డ్వాక్రా సంఘాలు మరియు ఇతర సంఘాలకు చెందిన మహిళలు పాల్గొని భారీ స్థాయిలో దిశ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉప్పాల హారిక మాట్లాడుతూ మహిళల భద్రత కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది, అందులో దిశ ఒకటి అని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆపద వచ్చినప్పుడు ఒక అన్న లా సపోర్ట్ చేసే ఫామ్ దిశ యాప్ అని అన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇంతకు ముందున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం డయల్ 100, డయల్ 112 కంటే దిశ రూూ చాలా ఉత్తమమైనది, వేగవంతమైందని అన్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో అంకురాలు కీలకం

## వీసీ ఆచార్య సూర్యకళావతి



కడప దేశంలోని స్టార్టప్‌లు భారత ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారా యని యోగి వేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి అన్నారు. వైవీయూ లోని వాణిజ్య శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో "ఎంటర్ప్రేన్యూరల్ ట్రెండ్స్ఇన్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ" అంతర్జాల సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మునగల సూర్యకళావతి మాట్లాడుతూ వినూత్న వ్యాపారాలు తరచుగా ప్రవేశించి వ్యవస్థాపక పరిజ్ఞాన అవసరాన్ని పెంచుతు న్నాయ న్నారు.ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితులలో మనలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలనుఆర్థికపరంగా బలోపేతం చేసేందుకు ఇంటి నుండి సంపాదించడం చేయాలని ఆలోచిస్తున్నాః అని గుర్తుచేశారు.అత్యాధునిక సాంకేతికత, కస్టమర్ ఫ్రెండ్లీ విధానం, కొత్త పన్నుల విధానం, జిఎస్‌టిలో సడలింపు, వ్యాపార నమోదు సౌలభ్యం వంటి అంశాలలో అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశం నలుమూలల నుండి ఆలోచనలు పంచుకోవ డానికి అలాగే ఫలవంతమైన ఫలితాలను తీసుకురావడానికి సెమినార్లో భాగస్వాములైన వారిని అభినందించారు.కొత్త ఆలోచన రేకెత్తించేలా సదస్సు అంశాన్ని ఎంపిక చేసిన కన్వీనర్ డాక్టర్ విజయ భారతిని ప్రశంసించారు. కులసచివులు ఆచార్య దుర్భాక విజయరాఘవ ప్రసాద్మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు సమాజ అవసరాలు చాలా ముఖ్యమైనవి అన్నారు. ప్రధానాచార్యులు కె. కృష్ణా రెడ్డి చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీ ని ఆదర్శంగా తీసుకుని కడప జిల్లాలో అలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. సదస్సు కీలకోపన్యాసకురాలు ఇండో అమెరికన్ చెందిన సింధియా పడాల మాట్లాడుతూ వ్యాపార సంస్థలకు సంబంధించిన మేం అంశాలను స్లైడ్ల ద్వారా ప్రదర్శించి వివరించారు. మరో ఉపన్యాసకులు గడ్డం సుదర్శన్ పరిశ్రమ స్థాపన యువత పాత్ర గురించి వివ రించారు. వై వి యు ఉపప్రధా నాచార్యులు టి.శ్రీనివాస్ సదస్సును సమన్వయంచేశారు.ఈకార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ విజయ భారతి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు లోకనాథ్ రెడ్డి, సీ డి సి డీన్ డాక్టర్ వై సుబ్బరాయుడు, అధ్యాపకులు డాక్టర్ హరినాథ్, రఫీ, రజిని, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై ఆత్మహత్య

కాకినాడ కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ ఐ గోపాల కృష్ణ గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం నాడు ముఖ్యమంత్రి పర్యటన బందోబస్త్ కి వెళ్ళి వచ్చిన గోపాలకృష్ణ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు 2014 సంవత్సరం బ్యాచ్ కుచెందిన ఎస్సై. తెల్లవారుజామున 5 గంటలకు ఒక గదిలో పిల్లలు భార్య నిద్రిస్తుండగా హాల్లో గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. గోపాలకృష్ణకు భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాకినాడ జీజీహెచ్ మార్చురీలో ఎస్ఐ గోపాలకృష్ణ మృతదేహన్ని ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎస్పీ రవీంద్రనాథ్ బాబు పరిశీలించారు.ట్రైనింగ్ పూర్తయ్యాక కొన్నాళ్ళు ట్రాఫిక్ విభాగంలో గోపాలకృష్ణ విధులు నిర్వహించారు. ఆ తర్వాత స్టేషన్ బాధ్యతలు ఇవ్వకుండా సర్పవరం సర్కిల్లో పోస్టింగ్ వేశారు. అధికారుల తీరుపై కొన్నాళుగా ఎస్ఐ గోపాలకృష్ణ మనస్తాపంతో బాధపడుతున్నాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద లక్ష రూపాయలు ...



నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలోని గ్రామ సచివాలయంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార రెడ్డి గారి కృషి వలన,నిరుపేద కుటుంబంకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును బాధితురాలైన ఎద్దుల కాంతమ్మ గారికి అందజేశారు ఎంపీపీ మండ్ల మల్లీశ్వరి, సర్పంచ్ కాటం రాధమ్మ, ఎంపీటీసీ కళావతి, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి,మాజీ సర్పంచ్ మద్దిలేటి అందజేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కింద నందికొట్కూరు నియోజకవర్గంలో రెండున్నర సంవత్సరాల కాలంలోనే సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు.రాష్ట్రానీల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి గారు ఆరోగ్య శ్రీ ద్వారా ఎన్నో ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తూ ప్రజలకు అండగా నిలిచారు.ఎంతో మంది పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయం సీఎం జగన్ అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిలేటి,వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# చంద్రబాబు కల్లబొల్లి మాటలు మానుకోవాలి

## రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి




కడప తెలుగు దేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కల్లబొల్లి మాటలు మానుకోవాలని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హితవు పలికారు శుక్రవారం స్థానిక కడప నగరంలోని వైఎస్ ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు చంద్రబాబు ప్రతిపక్ష నాయకుని హోదాను మరచి ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు చంద్రబాబుకు వయసు పెరిగే కొద్దీ దిగజారి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు 14 సంవత్సరాలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు మల్లీ నేను మారానని దొంగ మాటలు, మాయమాటలు చెప్పడం విడ్డూరమన్నారు కుక్క తోక వంకర లా చంద్రబాబు ఇక ఎప్పటికీ మారడన్నారు అధికారంలో వున్నప్పుడు ప్రజలను పట్టించు కోకుండా ఇప్పుడు ప్రజలకు అపద్దాలు చెబుతు కాలం గడుపుతున్నారని విమర్శించారు చంద్రబాబుకు వస్తున్న జనాదరణ చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భయపడుతున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు రాష్ట్ర అభివృద్ధి ని సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా సిగ్గులేకుండా పోయిందన్నారు పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలు పూర్తిగా రాజీయాలనుంచి తప్పిస్తారనే సంగతిని తెలుసుకోవాలన్నారు టిడిపి నాయకుల అవినీతి,దోపిడీని ఎండగట్టేందుకు చర్యలు తీసుకొంటుంటే చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారు ధ్వజమెత్తారు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడం లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారన్నారు విద్యా, వైద్యం, వ్యవసాయం రంగాలను అభివృద్ధి చేస్తూ అందరికీ మేలు చేస్తున్నారని చెప్పారు మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజా నేత గా మన్ననలు పొందుతుంటే ఓర్వలేక టిడిపి నాయకులు చంద్రబాబు రాష్ట్రాన్ని విచ్చిన్నం చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోందని రాష్ట్ర ప్రజలు మల్లీ తమ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు అనంతరం మేయర్ కె సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజల విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, అందుకే మతిస్థిమితం లేనివిధంగా మాట్లాడుతున్నారని చెప్పారు ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియని చంద్రబాబు కుమారుడు లోకేష్ కూడా తమ ప్రభుత్వ పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని రాజకీయ పబ్బం గడుపు కొనే చంద్రబాబును ప్రజలు ఇక నమ్మరని చెప్పారు ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శించే ముందు రాష్ట్రానికి తాను ఏమి చేశారో తెలుసుకోవాలన్నారు

# గంగమ్మ తల్లికి సారె సమర్పించిన టీటీడీ చైర్మన్ సతీమణి

తిరుపతి తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లికి టిటిడి పాలక మండలి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత శుక్రవారం ఉదయం పట్టుచీర, సారె సమర్పించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తో కలిసి ఆమె అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గంగమ్మ ఆలయ ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. గంగమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపి యాదవ్, అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సై ఆత్మహత్య కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు

కాకినాడ సర్పవరం ఎస్ఐ గోపాలకృష్ణ ఆత్మహత్య విషయంపై కాకినాడ ఎస్డీపివో భీమారావు స్పందించారు. కొన్ని టీవీ ఛానల్ లలో "పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్న పోలీసు అధికారులన్న వార్తాలను అయన ఖండించారు. మృతుడు గోపాల్ కృష్ణ 2014 బ్యాచ్ ఎస్సై గా సెలెక్ట్ అయ్యారు. అప్పటినుండి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డొంకరాయి, సర్పవరం, రాజోల్, కాకినాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లలో పనిచేసి ప్రస్తుతం సర్పవరం పోలీస్ స్టేషన్ లో గత యేడాది ఆగస్తునుంచి విధి నిర్వహణ చేస్తున్నారని అన్నారు. అతని ఆత్మహత్యకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని అన్నారు.ప్రాధమిక విచారణలో మృతుడు ఎంసియే పూర్తీ చేసి సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ ఎస్సై ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యారు. అయన మొదటి నుంచి తన తోటి ఎస్సైలో తనకు సాఫ్ట్ వేర్ ఉద్యోగం అంటేనే ఇష్టమని, అనవసరంగా ఆ ఉద్యోగం వదిలి ఎస్సై ఉద్యోగానికి వచ్చానని బాధపడుతూ ఉండేవాడని తెలిసింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడించడం జరుగుతుందని అన్నారు. ఎస్.ఐ. ఆత్మ హత్య విషయం గురించి అవాస్తవాలు, పుకార్లను ప్రసారం చేయవద్దని అయన అన్నారు.

# 11 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం :12 మందిని అరెస్ట్

చిత్తూరు మే 13 ఏపీలోని చిత్తూరు జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో రూ 11 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 12 మందిని అరెస్ట్ చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ అనూహ్యంగా ఊపందుకోవడంతో అప్రమత్తమైన పోలీసులు ఎక్కడికక్కడ దాడులు చేపడుతున్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దసంఖ్యలో ఎర్రచందనం చెట్లు ఉండటంతో అక్కడినుంచి తమిళనాడుకు స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు జిల్లా నలువైపులా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.తాజా ఘటనలో పోలీసులు మంగళవారం రూ 3 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను సీజ్ చేసి ఏడుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. నిందితులను తమిళనాడుకు చెందిన గోవింద్‌సామి సేథు (44), మురుగేశన్ (50), పెరుమాళ్ వెంకటేష్ (44), కరియ రామన్ (27), కలంజన్ (36), వెంకటేష ఆర్ (37), గోవింద రాజులు (21)గా గుర్తించారు.ఇక మరో ఘటనలో తిరుపతి నుంచి చిత్తూరు వెళుతున్న మినీ గూడ్స్ వ్యాన్‌ను అడ్డగించిన పోలీసులు రూ 4 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు.

# మైనర్ బాలిక దోషులను కఠినంగా శిక్షించాలి

కడప ప్రొద్దుటూరులో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గన్నెపాటి మల్లేష్ డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక కడప నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైఎస్ ఆర్ సీపీ ప్రభుత్వం దళితులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు ముఖ్యమంత్రి సొంత జిల్లాలో దళిత బాలిక ఇలాంటి అఘాయిత్యానికి గురికావడం విచారకరమన్నారు

దీనికి బాధ్యులైన చెంబూ గ్యాంగ్ ను అరెస్టు చేసి నడిరోడ్డుపై ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు అనంతరం టిడిపి నకడప నియోజకవర్గ అధ్యక్షుడు జలతోటి జయకుమార్ మాట్లాడుతూ పేరుకు మాత్రమే దళితులకు మంత్రి పదవులు ఇచ్చి దళితుల పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తోందని తెలిపారు ఇప్పటికైనా ప్రొద్దుటూరు దళిత మైనర్ బాలిక కు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో ఆపార్టీ నాయకులు బండి జయశేఖర్,నక్కా శివరాం, కొండా సుబ్బయ్య,దాసరి నరసింహ్మలు,బాలదాసు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు

# దాములూరు గ్రామంలో నిధుల గోల్ మాల్

నందిగామఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు గ్రామంలో ఎనర్జీఎస్ నిధులు గోల్మాల్ అయినట్లు సమాచారం. గ్రామ సర్పంచ్, సెక్రెటరీ ఇద్దరూ కలిసి 18 లక్షలు డ్రా చేసి దుర్వినియోగం చేశారు. గ్రామంలో సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రానికి సుమారు 73 లక్షల రూపాయలను నిధులు మంజూరు అయ్యాయి.అయితే హెల్త్ సెంటర్, సచివాలయం పనులు ప్రారంభించి స్లాబ్ లెవల్ కు రావడంతో సంబంధిత అధికారుల చుట్టూ కాంట్రాక్టర్లు తిరిగి నిధులు మంజూరు చేయించుకున్నాడు. ఆరు నెలల క్రితం ఈ పనులకు చెందిన 18 లక్షలు సర్పంచ్ ఖాతాలో జమ అయిన విషయాన్ని కాంట్రాక్టర్లకు సర్పంచ్ చెప్పలేదు. మార్చి నెలలో సెక్రెటరీ ప్రమేయంతో సర్పంచ్ ఖాతాలో ఉన్న 18 లక్షలు డ్రా చేసి సొంతానికి వాడుకున్నారని కాంట్రాక్టర్లు ఆరోపించాడు. తరువాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా మేరకు సెక్రటరీకి షోకాజ్ నోటీసు జారీ చేసి సర్పంచ్ ను హెచ్చరించారు

# జగనన్న లేఅవుట్ల కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవాలి

## మొదలు కాని ఇళ్లను వెంటనే ప్రారంభించండి

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు కలెక్టర్ డాక్టర్ . మనజీర్ జిలాని సామూన్ శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్పందన అర్జీలు, నీటి తీరువా పన్నుల వసూళ్లు, వన్టైమ్ సెటిల్మెంట్, జగనన్న హౌసింగ్, జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం, జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష పథకం, పౌరసరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించి తాసిల్దారులు ప్రతిరోజు దృష్టి పెట్టి క్లియర్ చేయాలన్నారు. టాప్-4, టాప్ 10 లో సర్వీసులు పెండింగ్లో ఉండటం వల్ల బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళుతున్నాయని సంబంధిత మండల తాసిల్దార్ లు స్వయంగా చూసి పరిష్కార మార్గానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన పోర్టల్ ద్వారా ఎక్కడెక్కడ పెండింగ్ వుండే వివరాలను పంపిస్తున్నప్పటికీ అర్జీల పరిష్కారంలో తాసిల్దార్లు తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న స్పందన అర్జీల పరిష్కారంలో ఫోన్ చేసి చెబితే తప్ప పరిష్కరించలేని స్థితిలో ఉన్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ స్టాఫ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప కారణాలు చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. స్పందన దరఖాస్తులు రీ ఓపెన్ అయినా, బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లిన సంబంధిత అధికారులపై తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రీ ఓపెన్ అయి పెండింగులో ఉన్న 37 దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించలేని దరఖాస్తులకు అసంపూర్తిగా రిప్లై ఇవ్వడం వల్లే ఫిర్యాదుదారులు సంతృప్తి చెందక మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ 399 స్పందన అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లాయని...ఎందుకు పెండింగ్లో ఉన్నాయని మండలాల వారీగా తాసిల్దార్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలో చివరి స్థానాల్లో ఉన్నామని రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప స్పందన అర్జీల పరిష్కారం కానీ, జగనన్న లేఅవుట్ల కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావన్నారు. ఆన్ లైన్ కాని దరఖాస్తులను కూడా క్లియర్ చేయాలని ఆమె ఆదేశించారు. జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పర్యాటక ప్రదేశాలు, పరిశ్రమలకు అవసరమై పెండింగ్లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు తాసిల్దార్ లు, రెవిన్యూ సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. ఇందుకు సంబంధించి ప్రతి గురువారం సిసిఎల్ఎ గారితో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని... నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం కింద వన్ టైం సెటిల్మెంట్ కు అర్జీదారుల చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే తగు చర్యలు గైకొనాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కు సంబంధించి 973, డిజిటల్ సైన్ కు సంబంధించి 2600 పెండింగ్లో ఉన్నాయని వీటన్నింటిని రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. ×జగనన్న స్మార్ట్ టౌన్ హౌసింగ్ స్కీమ్ కింద యమ్ ఐజి ప్లాట్లకు భూములు గుర్తించి రైతులతో నెగోషియేట్ చేసి సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకులు 75 శాతమే పంపిణీ అయ్యాయని సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలని జాయింట్ కలెక్టర్ తాసిల్దార్ లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ పుల్లయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఎడి హరికృష్ణ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు అంజన్ బాబు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కుమారునికినామకరణం చేసిన అఖిల ప్రియ దంపతులు

సూళ్లూరుపేట తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని చెంగాలమ్మ పరమేశ్వరి దేవాలయంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతుల కుమారునికి శుక్రవారం నామకరణ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో తమ కుమారునికి భూమా వీర వెంకట నాగిరెడ్డి అని నామకరణం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నామకరణం చేయబడిన చిన్నారి భూమా వీర నాగిరెడ్డి దినదినాభివృద్ధి చెంది అత్యున్నత స్థాయి శిఖరాలను అందుకోవాలని చెంగాలమ్మ పరమేశ్వరి ఆశీస్సులను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి. సతీష్ రెడ్డి మరియు సూళ్లూరుపేట నగర పార్టీ టిడిపి అధ్యక్షులు ఆకుతోట రమేష్ , బీసీ అధ్యక్షులు పెరుమాలు , సక్రెటరీ ఏజి. కిషోర్,గండవరం. రమేష్, అధికార ప్రతినిధి నాప. మునిరజా మహిళా అధ్యక్షురాలు నవీదా మంజుల, మాజీ కౌన్సిలర్ బుద్ది. విజయలక్ష్మి, సిహెచ్. రమణయ్య,వెంకటేష్, సంధ్య, మమత, మస్తానమ్మ, సరస్వతి, మీనా, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడపగడపకు వైసిపి అంటూ వచ్చే నాయకులను నిలదీయండి

## రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహబూబ్ బాషా

బద్వేలు బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు లో గల తన కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ భాష ప్రకటన విడుదల చేస్తూ గడపగడపకు వైసిపి అంటూ వచ్చే నాయకులను ముస్లిం సోదరులు నిలదీయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూపేదలు ఆనందంగా పండుగ జరుపుకోవడానికి రంజాన్ తోఫా వచ్చేది.మీరు వచ్చిన తర్వాత ఎక్కడ? మా పేద అమ్మాయిల వివాహాలకు చంద్రబాబు గారు దుల్హన్ 50000 ఇస్తుంటే లక్ష రూపాయలు ఇస్తామన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఒక్క రూపాయి అయినా ఎవరికైనా ఇచ్చారా?ముస్లిం సోదరులలో ఎక్కువగా చేతివృత్తుల వారు ఉన్నారని వారి జీవితాల్లో వెలుగులు నింపాలని గౌరవ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల సబ్సిడీతో రెండు లక్షల రూపాయల రుణాలు ఇచ్చేవారు. ఈ మూడేళ్లలో ఒకరికన్నా మీరు ఇచ్చారా?విదేశాల్లో చదువుకునే ముస్లిం విద్యార్థినీ విద్యార్థుల కోసం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు 15 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకున్నారు. మీరు ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి ఇచ్చార? ముస్లిం సోదరీ మణుల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలు పెట్టి ఉచితంగా కుట్టు మిషన్ ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిది. మీరు ఏ ఒక్కరికైనా ఇచ్చారా?ప్రమాదవశాత్తు ముస్లిం మైనార్టీలకు చెందిన వారు మరణిస్తే వైయస్సార్ భీమా ద్వారా 5 లక్షల రూపాయలు ఇస్తామన్నారు. ఉన్న చంద్రన్న బీమా తీసేశారు. ఈ మూడేళ్లలో ఒకరినైనా ఆదుకున్నార?ముస్లింలకు సబ్ ప్లాన్ ఇస్తామన్నారు. ఎక్కడ?ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. ఎక్కడ ఇచ్చారు?ఈ మూడేళ్లలో ఒక్క షాదీఖానా గాని,

ఒక్క మద్రసాకు గాని, ఒక్క మసీదు నిర్మాణానికి గాని, ఒక్క ఖబరస్తాన్ ఆధునీకరణకు గాని ఒక్క రూపాయి ఇచ్చారా?ఇమామ్ మౌజనులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని అన్నారు. ఎక్కడ? ఒకరికైనా ఇచ్చారా?హజ్ యాత్ర చేసే ముస్లిం సోదరులకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఎవరికైనా చేశారా? మీరు వస్తే ఇవన్నీ చేస్తామని మాయ మాటలు చెప్పి మా ఓట్లతో అధికారంలోకి వచ్చి మమ్మల్ని మోసం చేసి,, మ్యానిఫెస్టోలో 95 శాతం పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటూ మీ దగ్గరికి వస్తున్నారు వారిని నిలదీసి అడగండి అని అన్నారు

# అసని తుఫాన్ బాధిత రైతులకు ఎకరాకు రూ.60 వేలు ఇవ్వాలి

## -జిల్లా కాంగ్రెస్ నాయకుల వినతి

బద్వేలు అసని తుఫాన్ విపత్తు కారణంగా ఈదురు గాలులు, బీభత్సం తో మామిడి కాయల రైతులుఅతలాకుతలమయ్యారు. అన్నమయ్య జిల్లా లోని అన్ని మండలాలలో మామిడి చెట్లు కూలిపోయాయి.వేల ఎకరాలలో మామిడి కాయలు నేలరాలాయి. దిక్కుతోచని స్థితిలో రైతుల కంట కన్నీళు ఆగడంలేదని అన్నమయ్య జిల్లా కలెక్టర్ క్యాంపు లో ఉన్నందువల్ల ఆయనకు సమర్పించాల్సిన వినతి పత్రాన్ని శుక్రవారం కాంగ్రెస్ నేతలు డి.ఆర్.ఓ. సత్యనారాయణ కు సమర్పించారు. "దుల్హన్ పథకం""పెళ్లి కానుక"వంటి పథకాలు కనుమరుగయ్యాయి. వైయస్సార్ పెళ్లి కానుక దరఖాస్తు పెట్టుకుని సంవత్సరాలు అవుతున్న ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.ఈ ఏడాదైనా పంట చేతికి వస్తే వచ్చే డబ్బులతో రైతులు తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేసు కోవాలని ఆశపడ్డారు. అసని" తుఫాన్ విపత్తు కారణంగా పంట చేతికి రాక ఆశనిరాశగా మిగిలిందని పేర్కొన్నారు. జిల్లాలోని రామాపురం,లక్కిరెడ్డి పల్లె, చక్రాయపేట, గాలివీడు,సుండుపల్లె,చిన్నమండెం, గుర్రంకొండ, కలకడ, మండల ప్రాంతాల్లో ఉన్న మామిడికాయల తోటలనువారుపరిశీలించినట్లు డి.ఆర్.ఓ.సత్యనారాయణదృష్టికి తీసుకెళ్లారు.జిల్లాలో నష్టపోయిన ప్రతి రైతుకు, ఎకరాకు రూ.60 వేలు నష్టపరిహారం చెల్లించాలి. అసని తుఫాన్ బాధితులైన రైతులకు

ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, కాంగ్రెస్ బి.ఆర్.ఓ.లు షేక్ దర్బార్ భాష,శర్వాణి ఫారుక్, మైనార్టీ సెక్రెటరీ యహియా భాష షేక్ ఆఫీజుల్లా,నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు

# సర్కారు వారి పాటలో కీర్తి పాత్ర అలా ఉంటుందా..?



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా పరశురామ్ పెట్లా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా "సర్కారు వారి పాట". రెండున్నరేళ్ల తర్వాత మహేశ్ నుంచి రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రేపు (గురువారం) ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ మూవీ రిలీజ్ కాబోతోంది.'సర్కారు వారి పాట' అనేది యాక్షన్ - రొమాన్స్ తో కూడిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ అని ప్రమోషనల్ కంటెంట్ ని బట్టి అర్థం అవుతుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమాకు సంబంధించిన టీజర్ - ట్రైలర్ - సాంగ్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి.ఇందులో మహేష్ బాబుతో పాటుగా హీరోయిన్ కీర్తి సురేష్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారిగా కలిసి నటించిన ఈ జోడీ.. స్క్రీన్ మీద ఫ్రెష్ ఫీలింగ్ ని తీసుకొచ్చింది. 'కళావతి' పాటలో ఎంతో అందంగా కనిపించిన కీర్తి.. 'మ మా మహేష్' సాంగ్ లో మాస్ స్టెప్పులు మరియు ఎక్స్ ప్రెషన్స్ తో అదరగొట్టింది.'సర్కారు వారి పాట' సినిమాలో కీర్తి సురేష్ కళావతి అనే పాత్రలో కనిపించబోతోంది. అయితే యూఎస్ ప్రీమియర్స్ పడటానికి కొన్ని గంటల ముందు ఆమె క్యారక్టర్ కు సంబంధించిన ఓ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ాఎఖ సినిమాలో కీర్తి ఒక ఆకతాయిగా కనిపించనుందని.. ఆమెకు గ్యాంబ్లింగ్ అంటే చాలా ఇష్టమని చెప్పుకుంటున్నారు. అంతేకాదు ఇందులో తన పాత్ర ట్విస్ట్ ఇవ్వబోతోందని అంటున్నారు. ఇందులో నిజమెంతో తెలియదు కానీ.. చిత్ర బృందం మాత్రం కీర్తి రోల్ కు అధిక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొంటున్నారు.మహేశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సర్కారు వారి పాట' సినిమాలో కీర్తి సురేష్ ఇరగదీసిందని చెప్పారు. కళావతి పాత్ర చాలా సర్ప్రైజింగ్ గా వుంటుందని.. లవ్ ట్రాక్ మెయిన్ హైలెట్ అని తెలిపారు. ఫస్టాఫ్ లో తమ మధ్య 45 నిమిషాల ట్రాక్ ఉంటుందని.. ఆ సమయంలో థియేటర్ ఊగిపోతుందని మహేశ్ అన్నారు. తనతో చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశానని.. ప్రేక్షకులు కూడా తమ మధ్య సీన్స్ చూసి చాలా ఎంజాయ్ చేస్తారన్నారు.దర్శకుడు పరశురాం సైతం కీర్తి సురేష్ పాత్ర కథలో చాలా కీలకమని.. ఆమెది చాలా బలమైన పాత్ర అని తెలిపారు. ఇందులో హీరోయిన్ గా కీర్తి తప్ప వేరే ఆప్షన్లు లేవని.. తనని ఎందుకు తీసుకున్నామో సినిమా చూశాక అందరికీ అర్థమవుతుందన్నారు. ఆమె లుక్స్ చాలా అద్భుతంగా ఉన్నాయని.. ఆడియన్స్ మహేష్ బాబుతో సమానంగా కీర్తి గురించి కూడా మాట్లాడుకుంటారని పరశురాం పేర్కొన్నారు.దీనిని బట్టి 'సర్కారు వారి పాట' సినిమాతో కీర్తి సురేష్ బ్లాక్ బస్టర్ అందుకోబోతోందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కీర్తి ఈ మధ్య పెద్దగా కమర్షియల్ చిత్రాలు చేయడం లేదు. చేసిన సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్స్ గా మిగిలాయి. ఇటీవల ఆమె నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీస్ కూడా ఫ్లాప్ అయ్యాయి. దీంతో ఐరన్ లెగ్ గా ముద్ర పడింది. ఇప్పుడు ాఎఖ తో సక్సెస్ అందుకొని లక్కీ బ్యూటీ అనిపించుకుంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# అక్కడ సర్కారు వారి అడ్వాన్స్ బుకింగ్స్ మరీ నీరసంగా ఉన్నాయే..!

సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన లేటెస్ట్ మూవీ "సర్కారు వారి పాట" విడుదలకు సర్వం సిద్ధమైంది. పరశురాం పెట్లా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం.. రేపు గురువారం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా థియేటర్లలోకి రాబోతోంది. 'భరత్ అనే నేను' 'మహర్షి' 'సరిలేరు నీకెవ్వరు' వంటి హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ తర్వాత మహేష్ నుంచి వస్తోన్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.దీనికి తగ్గట్టుగానే ాఎఖ ప్రచార చిత్రాలు - టీజర్ - ట్రైలర్ - పాటలు విశేష స్పందన తెచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ బిజినెస్ బాగా జరిగింది. ఇది 125 - 130 కోట్ల మధ్య ఉండొచ్చని అంటున్నారు. భారీ టార్గెట్ తో బరిలో దిగిన సర్కారు వారి పాట అడ్వాన్స్ బుకింగ్స్ రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరుగా సాగుతున్నాయి. అయితే బయట రాష్ట్రాల్లో మహేశ్ సినిమా సందడి పెద్దగా కనిపించడం లేదు.'సర్కారు వారి పాట' చిత్రాన్ని కేవలం తెలుగులో మాత్రమే రిలీజ్ చేస్తున్నారు. మహేష్ బాబుకు ఇతర రాష్ట్రాల్లో ఉండే క్రేజ్ దృష్ట్యా తెలుగు వెర్షన్ ను ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. తమిళనాడు - కర్ణాటక లలో మహేశ్ సినిమాల హడావిడి




నడుస్తుంది. కానీ ఈసారి మాత్రం అలా జరగడం లేదు.బెంగళూరు చెన్నై లాంటి నగరాల్లో ాఎఖ అడ్వాన్స్ బుకింగ్స్ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రిలీజ్ కు ఇంకొన్ని గంటలే ఉన్నా.. బుక్ మై షోలో చాలా థియేటర్లలో గో గ్రీన్ కనిపిస్తోంది. కొన్ని షోలు ఫుల్ అయినప్పటికీ.. మెజారిటీ భాగం ఇంకా ఫుల్ అవ్వాల్సి ఉంది. దీనిని బట్టి రెస్టాఫ్ ఇండియాలో సర్కారు వారి ఓపెనింగ్స్ అంతంతమాత్రంగానే ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.ఏదేమైనా సూపర్ స్టార్ సినిమా తెలుగు రాష్ట్రాల అవతల ఇంత నీరసంగా కనిపించడం ఆశ్చర్యకరమైన విషయమే. అయితే ఈ పరిస్థితికి ప్రధాన కారణం స్టూడెంట్స్ కు ఎగ్జామ్స్ ఉండటమే అని తెలుస్తోంది. కరోనా పాండమిక్ తర్వాత అకడమిక్ ఇయర్ లో మార్పులు వచ్చాయి. పలు చోట్ల ఇంకా పరీక్షలు పూర్తవ్వలేదు. ఇది సర్కారు వారి పాటకు దెబ్బ అనే అనుకోవాలి.తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఓవర్ సీస్ లో 'సర్కారు వారి పాట' మేనియా కనిపిస్తోంది కాబట్టి.. అక్కడ వసూళ్ళు కలిసొచ్చే అవకాశం ఉంది. యూఎస్ లో ప్రీమియర్స్ ప్రీ సేల్స్ ద్వారా వి650ఐ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది ఇటీవల వచ్చిన భీమ్లానాయక్ (వి610ఐ) - రాధేశ్యామ్ (వి600ఐ) - పుష్ప (వి510ఐ) - ఆచార్య (వి500ఎ) సినిమాల కంటే ఎక్కువ.మహేష్ కెరీర్ లో యూఎస్ఏ ప్రీమియర్ షోల నుంచి 500ఐ డాలర్లకు పైగా అందుకున్న 8వ సినిమా 'సర్కారు వారి పాట'. ఈ జాబితాలో రజినీకాంత్ - ప్రభాస్ - ఎన్టీఆర్ లకు 4 సినిమాలు ఉంటే.. చిరంజీవి - పవన్ కళ్యాణ్ లకు చెరో 3 చిత్రాలు ఉన్నాయి. రామ్ చరణ్ - అల్లు అర్జున్ లకు తలోక సినిమా ఉంది.కాగా పరశురామ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్కారు వారి పాట' సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించింది. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూర్చారు. మైత్రీ మూవీ మేకర్స్ - ఉఓః ఎంటర్ టైన్మెంట్స్ - 14 రీల్స్ ప్లస్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాయి. మహేశ్ బాబుకి ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# 'లైగర్' బ్యూటీపై జోక్...చుంకీ పాండే ఫీలయ్యాడా?

యంగ్ హీరోయిన్ అనన్య పాండే ఇప్పుడిప్పుడే బాలీవుడ్ లో కెరీర్ ని బిల్డ్ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. చుంకీ పండే..భావనా పాండే కుమార్తెగా ఎంట్రీ ఇచ్చిన అమ్మడు కుర్ర నాయికల్లో అందరికన్నా యాక్టివ్ గా దూసుకుపోతుంది. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని పూల బాట నిర్మించుకుంది. 'లైగర్' సినిమాతో యువ నాయిక టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతుంది. పూరి జగన్నాద్ దర్శకత్వం వహిస్తున్న సినిమా త్వరలో రిలీజ్ కానుంది.ఇక బ్యూటీ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నిత్యం టెంప్టింగ్ ఫోటోలతో యువత అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇది తరుచూ జరిగే చర్య. మరి డైలీ ఈ పని చేసి చేసి బోర్ కొట్టిందో! ఏమో ఈసారి డిఫరెంట్ గా ఓ వీడియో



చేసింది.అనన్య పాండే మేకప్ వేసుకుంటుండగా....కొరియో గ్రాఫర్ ఫరాఖాన్ అనన్యా అనన్యా అంటూ దూసుకొస్తూ నువ్వు ఖలీ పిలీ సినిమాకి గాను జాతీవ అవార్డు గెలుచుకున్నావ్ అంటూ బిగ్గర్ గా చెబుతుంది. దీనికి అనన్య ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బితుంది.చుట్టూ ఉన్న మేకప్ గ్యాంగ్ సైతం సంతోషం వ్యక్తం చేస్తారు. ఇంతలో కూల్ గా చేతులు కట్టుకుని నేను జోక్ చేస్తున్నాని అని అంటుంది ఫరాఖాన్. దీంతో అనన్య అప్సెట్ మూడ్ లోకి వెళ్లిపోతుంది. ఈ వీడియో గురించి అనన్య మాట్లాడుతూ.. ఈవీడియోకి 50 రూపాయలు ఇస్తాను. కేవలం ఓవర్ యాక్టింగ్ కే. ఫరాఖాన్ తో ఎప్పుడూ హాస్యాసపదంగానే ఉంటుంది అని తెలిపింది.ఈ వీడియో చూసిన చుంకీ పాండే ఏమన్నారంటే?.. ఫరా ఈ వీడియోలో అతిగా నటించినందుకు నీకు అవార్డు రావాలి అన్నారు. దీనికి బధులుగా ఫరా ఇలా అంటుంది.. 'అప్నీ బేటికో సంభాల్ పెహ్లే' అని అంటుంది. ప్రస్తుతం ఈ వీడియోపై ట్రోలర్లు ఆడుకుంటున్నారు. తమదైన శైలిలో మీమ్స్ చేస్తూ ఆటపట్టిస్తున్నారు.ఆ సంగతి పక్కనబెడితే కుమార్తెను ఇలా ఆట పట్టించడం చుంకీ పాండేకి నిజంగా నచ్చలేదా? అందుకేనా! అంత వేగంగా 'అవార్డు నీకే రావాలి అంటూ' పరాఖాన్ పై కౌంటర్ వేసారంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కుమార్తెలపై చిన్న జోకులేసినా తట్టుకోలేని తల్లిదండ్రులుంటారు. అసలే చుంకీ గారాల పట్టి. కెరీర్ ఇప్పుడే మొదలు పెట్టంది. అనన్యపై జోకులేయడం ఫరాకి కొత్తేం కాదు. ఇది అలవాటుగా మారిపోతే ప్రమాదకరమే. అందుకే చుంకీ కౌంటర్ వేసారని అంటున్నారు.

# ఐపీఎల్ 2022 నుంచి వైదొలిగిన కేకేఆర్ స్టార్ బౌలర్

ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్.. కేకేఆర్ ఫాస్ట్ బౌలర్ పాట్ కమిన్స్ ఐపీఎల్ 2022 నుంచి వైదొలిగాడు. తుంటి ఎముక గాయం కారణంగా కమిన్స్ లీగ్‌ను వీడినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటనలో పేర్కొంది. గాయం తీవ్రత తక్కువగానే ఉన్నప్పటికి వచ్చే నెలలో శ్రీలంక పర్యటన ఉన్న కారణంగా



కమిన్స్ ఐపీఎల్ వీడినట్లు సమాచారం. ప్రస్తుతం స్వదేశానికి పయనమయిన కమిన్స్ సిడ్నీలోని రీహాబిలిటేషన్ సెంటర్‌కు చేరుకోనున్నాడు.లంకతో సిరీస్ వరకు ఫిట్‌నెస్ సాధించి వన్డే, టెస్టు సిరీస్‌లకు సిద్దంగా ఉండాలని కమిన్స్ భావించాడు. కాగా లంకతో టి20 సిరీస్‌కు కమిన్స్ దూరంగా ఉండనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం లంకలో ఆర్థిక సంక్షోభం కారణంగా సిరీస్ జరగడంపై అనుమానాలు ఉన్నప్పటికి.. దుబాయ్ వేదికగా ఈ సిరీస్‌ను నిర్వహించాలనే యోచనలో లంక్ బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఐపీఎల్‌లో కేకేఆర్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న కమిన్స్ ఈ సీజన్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. సీజన్‌లో ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో 15 బంతుల్లో 56 పరుగులు సాధించి ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యంత వేగంగా ఫిఫ్టీ అందుకున్న బ్యాటర్‌గా కేఎల్ రాహుల్‌తో కలిసి కమిన్స్ సంయుక్తంగా ఉన్నాడు. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన కమిన్స్ 63 పరుగులతో పాటు బౌలింగ్‌లో ఏడు వికెట్లు తీశాడు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో కమిన్స్ 22 పరుగులకే మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇక కేకేఆర్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. ఏడు ఓటములతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో ఉంది. కేకేఆర్ మిగిలిన రెండు మ్యాచ్‌లు గెలిచినప్పటికి ప్లే ఆఫ్ అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**